అరుంధతీదేవి గారు చెప్పడం ఆపి, అప్పాయింట్‌మెంట్ 'ఆర్డరు చేతికిచ్చారు.

"థాంక్సండీ! థాంక్యూ వేరీమచ్!" కృష్ణారావు కృతజ్ఞతగా అన్నాడు.

"ఈ రోజే మీరు శరణాలయంలో జాయిన్‌కండి!"

"అలాగే మేడం! వుంటాము! రాణీ! వుంటాము మరి!"

రాణి ఆరాధనగా చూసింది కృష్ణారావుని, అతను బయటికి వెళుతుండగా!

★★ ★★ ★★ ★★

కృష్ణారావు సంబర పడిపోతూ అన్నాడు.

"చెప్పానా ఉద్యోగం సాధిస్తాననీ! సాధించాను! ఉపాయం ఉండాలి గానీ ఊళ్ళేలొచ్చురా!"

"ఉపాయమా! ఏవిట్రా అది!"

"చెప్తా విను! నేను మీ అందరిలాంటివాడినే కదరా! ఎంత నిగ్రహించుకుందామన్నా ఒకోసారి సాధ్యం కాకపోవచ్చు. నువ్వు అరుంధతీదేవి పాలసీ గురించి చెప్పాక నాకు డౌటొచ్చింది. అయినా అక్కడ ఉద్యోగం సంపాదించాలి. ఆవిడ వారం రోజులు గదా మనకి క్యారెక్టర్ టెస్ట్ పెట్టేది. అందుకే ఇంటర్వ్యూకి రెండు రోజుల ముందే గవర్నమెంట్ హాస్పటల్‌కి వెళ్ళాను..."

"గవర్నమెంట్ హాస్పటల్‌కా' ఎందుకట!"

"విను మరి! అక్కడ వేసెక్టమీ చేయించుకున్నాను. వారందాకా ఎలాగూకుట్లు విప్పరు! ఆ వారం రోజులూ ఆరోగ్యం కోసం ఎంతైనా నిగ్రహించుకోక తప్పదు! ఆ తర్వాత ఉద్యోగం ఖాయం!

అయితే ఒకటిరా! ఈ వారం రోజుల్లో, మగవాడికి నిగ్రహం ఎంత అవసరమో నాకు బాగా తెలిసొచ్చిందిరా! అందులో ఎంతో తృప్తి వుంది. ఇకముందైనా ఆ శరణాలయంలో నేను నిగ్రహంగా పని చెయ్యగలననే ధైర్యం వచ్చింది నాకు!"

"అదేం పనిరా! వేసక్టమీ చేయించుకున్నావా!"

"ఎందుకురా బాధ! మనకే దిక్కు లేని ఈ దశలో పిల్లలు కలిగారనే బాధోకటీ! పుట్టించి బాధ పెట్టేకంటే పుట్టకుండా చేసుకోవడం నయమనిపించింది. పెళ్ళయాక నీ చెల్లాయితో ఒప్పించి ఏ అనాథా శరణాలయం నుంచో బిడ్డని తెచ్చి పెంచుకుంటాం! తప్పంటావా!"

"హరి పిడుగా! ఎంత ఎదిగిపోయావురా!"

రామ్మూర్తి కృష్ణారావుని కౌగిలించుకుని భుజం తడుతూ తృప్తిగా అన్నాడు.

# బీర్బల్ సమయస్ఫూర్తి

రాజుగారి సభలో తాన్‌సేన్ అనే అద్భుతమైన గాయకుండేవాడు. రాజు గారు ప్రతిరోజూ అతని కచేరి వినిగానీ నిద్రపోయేవాడు కాదు. తాన్‌సేన్‌కు జట్టుగా ఇంకొక అద్భుతమైన గాయకుడు కూడా వుండేవాడు. ఉన్నట్టుండి ఒకరోజు ఆ గాయకుడు విష ప్రయోగంతో మరణించాడు. తాన్‌సేన్ దురదృష్టవశాత్తూ అతనిపై ఆ హత్యానేరం మోపబడింది. ఏవో తప్పుడు సాక్ష్యాలు గిట్టనివారు చెప్పినవి తప్ప ఎట్టి ఋజువులూ లేవు తాన్‌సేన్ ఆ హత్య చేసాడనటానికి.

అయితే రాజుగారు ఆ తప్పుడు సాక్ష్యం విని అతనికి మరణశిక్ష విధించాడు. ఇంతలో సభలోకి బీర్బల్ ప్రవేశించాడు. విషయం తెలుసుకున్నాడు. భోరుభోరున ఏడుస్తున్న తాన్‌సేన్‌ని పలుకరించాడు. రాజుగారికి నమస్కరించాడు. 'మహారాజా! ఇతడిపై దయ వుంచి మీరు శిక్షను తగ్గించేలేరా?' అని వినయంగా ప్రశ్నించాడు.

"తోటి గాయకుడిని అమానుషంగా విషం పెట్టి చంపిన ఇతనికి అది సరియైన శిక్ష. అటువంటి మహా గాయకుడిని చంపి నేను జీవితంలో సగం ఆనందం కోల్పోయేలా చేసాడు. ఇతణ్ణి వెంటనే తీసుకెళ్ళి శిక్ష విధించండి" ఆజ్ఞాపించాడు రాజు.

"క్షమించండి మహారాజా! ఒక గాయకుడు మరణించడంతో మీ జీవితంలో సగం ఆనందం కోల్పోయాను అన్నారు. మిగిలిన ఈ మహా గాయకుడిని కూడా చెయ్యని నేరానికి శిక్షించి, శాశ్వతంగా కోల్పోతే మీరు మీ జీవితంలో పూర్తి ఆనందాన్ని కోల్పోతారేమో ఒక్కసారి ఆలోచించండి" అన్నాడు బీర్బల్. ఒక నిమిషం ఆలోచించిన రాజు తన తొందరపాటుకు తానే సిగ్గు పడ్డాడు. తాన్‌సేన్‌ను విడుదల చేయమని, హత్య విషయంలో పూర్తి విచారణ జరుపమని ఆజ్ఞాపించాడు. బీర్బల్ సమయస్ఫూర్తిని ప్రశంసించాడు. తన ప్రాణాన్ని కాపాడిన బీర్బల్‌కి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు మహా గాయకుడు తాన్‌సేన్.

— గొల్లపూడి శైలజ.

